# ఉద్దెర మాటల కాంగ్రెస్

## వాళ్లు ఉద్ధరించేదేం లేదని ప్రజలకు అర్థమైంది: హరీశ్

- లీకు, ఫేకు వార్తలతో కాలం గడుపుతున్నరు
- మహాలక్ష్మి పేరుతో హస్తం పార్టీ మహా మోసం
- 6 గ్యారెంటీలు రావాలంటే బీఆర్ఎస్ గెలవాలి
- మళ్లీ అధికారం చేపట్టేది బీఆర్ఎస్సే
- కడియం వెళ్లాక పార్టీశ్రేణుల్లో జోష్ పెరిగింది
- ద్రోహం చేసిన శ్రీహరికి గుణపాఠం చెప్పాలి
- బీజేపీ మాట వింటే జోడీ.. వినకపోతే ఈడీ
- వరంగల్ లోక్‌సభ సన్నాహక సమావేశంలో హరీశ్

వరంగల్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు నిజాలు చెప్పి వాళ్ల మోసాలను ఎండగట్టాలని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ వాళ్లవి ఉద్దెర మాటలేనని, ఉద్ధరించేవి కావని ప్రజలకు అర్థమైందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రజల సంక్షేమం, పరిపాలన మరిచి ప్రతిరోజు లీకు వార్తలు, ఫేకు వార్తలతో కాలం గడుపుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పిన ఆరు గ్యారెంటీలు, హామీలను నాలుగు నెలలైనా అమలు చేయడంలేదని దుయ్యబట్టారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కరోనా కష్టకాలంలోనూ రైతుబంధు వేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలలైనా ఇప్పటికీ పూర్తి చేయలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనతోనే మళ్లీ రైతు ఆత్మహత్యలు మొదలయ్యాయని, బోరుబండ్లు, బావుల పూడికతీతలు వచ్చాయని వెల్లడించారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో నిర్వహించిన వరంగల్ లోక్‌సభ ఎన్నికల బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'రెండు లక్షల రుణమాఫీ, పింఛను పెంపు, రైతుబంధు పెంపు, వడ్లకు బోనస్, మహిళలకు రూ.2,500 ఇలా కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. ఈ హామీలు అమలైన వాళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి, కానివాళ్లు బీఆర్ఎస్‌కు ఓటేయండి. కార్యకర్తలు ధైర్యం కోల్పోవద్దు. కష్టాలు మనకు కొత్తకాదు. రేవంత్ నాయకులను కొనగలిగినా, ఆత్మగౌరవమున్న ఉద్యమ నాయకులను కొనలేడు. వంద రోజుల పాలనకు లోక్‌సభ ఎన్నికలు రెఫరెండం అని రేవంత్ అంటున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ గెలిస్తే రూ.4 వేల పెన్షన్, మహిళలకు రూ.2,500, ఆడపిల్లల పెళ్లికి తులం బంగారం ఇయ్యకున్నా ఓటేశారని వాటిని పూర్తిగా బంద్ చేసే ప్రమాదం ఉన్నది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు నీలం తుఫాన్ వస్తే కృష్ణా, గుంటూరుకు నష్ట పరిహారం ఇచ్చారు. నష్టం జరిగిన వరంగల్, ఖమ్మం జిల్లాలను మాత్రం పట్టించుకోలేదు. అప్పుడు పదవుల కోసం పెదవులు మూసుకున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. సమైక్య రాష్ట్రంలోనే బాగుండేదని ఈ రోజు అంటున్నారు. కాంగ్రెస్ వాళ్ల నిజ స్వరూపం బయటపడింది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఇంకా గట్టిగా కొట్లాడుతం. హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తాం. ప్రశ్నించే బలాన్ని మాకివ్వాలి. కాంగ్రెస్ వచ్చాక ముస్లిం సోదరులకు తోఫా(కానుక) బంద్ అయ్యింది. మైనారిటీల సంక్షేమం కోసం కేసీఆర్ ఎంతో కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల బడ్జెట్‌లోనూ అన్యాయం చేసింది. బీఆర్ఎస్ పని అయిపోయిందని అంటున్నారు. కానీ, తెలంగాణ ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటుంది. బీఆర్ఎస్ పాలపొంగు అని మాట్లాడిన టీడీపీనే తెలంగాణలో లేకుండా పోయింది. కేసీఆర్ పొలం బాట కార్యక్రమానికి అద్భుత స్పందన వస్తున్నది. ఆరు నూరైనా, అటు సూర్యుడు ఇటు పొడిచినా రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్సే. ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తేలేదు. దానికి ఓటు వేయడం వృథా. ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే, కాంగ్రెస్ మెడలు వంచాలంటే ప్రశ్నించే గొంతుగా బీఆర్ఎస్‌ను గెలిపించాలి' అని కోరారు.


వరంగల్ లోక్‌సభ ఎన్నికల బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

### కడియంకు గుణపాఠం చెప్పాలి

కడియం శ్రీహరి పోయిన తర్వాత పార్టీలో జోష్ కనిపిస్తున్నదని హరీశ్‌రావు అన్నారు. పదవులను, కూతురికి టికెట్‌ను తీసుకుని బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలనే కసి కార్యకర్తల్లో కనిపిస్తున్నదని చెప్పారు. 'కడియం శ్రీహరికి బీఆర్ఎస్ ఏం తక్కువ చేసింది? ఉపముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చాం. అన్ని ఇచ్చిన బీఆర్ఎస్‌కు కడియం శ్రీహరి జీవితాంతం రుణపడి ఉన్నా తక్కువే. పార్టీ మారేదేలేదని చెప్పి ఎందుకు మారాడో సమాధానం చెప్పాలి. ఇంత దిగజారుడు రాజకీయాలు అవసరమా? కష్టపడే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుంది. ద్రోహం చేసినవాళ్లను మళ్లీ చేర్చుకునే ప్రసక్తే లేదు. వరంగల్ తొలి నుంచి ఉద్యమాల గడ్డ. బీఆర్ఎస్‌కు అండగా ఉన్నది. ఇక్కడి కార్యకర్తల కాళ్లు కడిగి నెత్తిమీద చల్లుకున్నా తక్కువే. వరంగల్ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ఎంతో కృషి చేసింది. ఐదు మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ హస్పిటల్, టెక్స్‌టైల్ పార్కును తెచ్చాం. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని రేవంత్‌రెడ్డి అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నంలో కాకతీయ తోరణాన్ని తీసేస్తామని అంటున్నారు. అదే జరిగితే వరంగల్ అగ్నిగుండం అవుతుంది. కాకతీయ తోరణం వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక' అని పేర్కొన్నారు. సమావేశంలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణరెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవ రెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజుయాదవ్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, లింగంపల్లి కిషన్‌రావు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

### జోడీ లేకపోతే ఈడీ.. ఇదే బీజేపీ తీరు

పదేండ్ల పాలనలో బీజేపీ ఒక్క పని చేయలేదని హరీశ్‌రావు విమర్శించారు. 'ఎంపీ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు బీజేపీ కూడా వస్తున్నది. బీజేపీ మాట వింటే జోడీ కడుతుంది. వినకపోతే ఈడీని ఉసిగొల్పుతుంది. పదేండ్ల పాలనలో బీజేపీ ఒక్క మంచి పనిచేసిందా? అని ఆ పార్టీ కార్యకర్తలను అడగండి. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిపై మన కార్యకర్తలు వంద చెప్తారు. బీజేపీ హయాంలో దేశంలో ఆకలి, నిరుద్యోగం పెరిగింది. కాంగ్రెస్, బీజేపీ ఒకటే. మేం బీజేపీతో చేతులు కలిపితే కవిత ఎందుకు జైలుకు వెళ్తుంది. రాముడిని మనం కూడా మొక్కుతాం. హనుమాన్ చాలీసా నేను చదువుతా. బీజేపీ వాళ్లకు వస్తుందో లేదో? దేవుడు అందరివాడు. కేసీఆర్ యాదగిరిగుట్ట ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించారు. యాదాద్రి లడ్డూను మనం ఇంటింటికి పంచలేకనా? దేవుడిపై రాజకీయాలు మంచిది కాదు' అని తెలిపారు.

## కేసీఆర్ బయటికొస్తే ఉలికిపాటా?

- ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాటం
- కేసీఆర్ సీఎం అయ్యాక కరువు మాయం
- ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కాలు బయటపెట్టగానే కాంగ్రెస్ నాయకులు ఉలికిపాటుకు గురవుతున్నారని మాజీమంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రజలు తమకు ప్రతిపక్ష బాధ్యత అప్పగించారని, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి, వాటి పరిష్కారానికి ఒత్తిడి తేవడమే ప్రతిపక్షం బాధ్యత అని తెలిపారు. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన ఉండి వారి సమస్యల కోసం కొట్లాడతామని స్పష్టంచేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే ప్రతిపక్ష పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతిపక్షం చెప్తున్న విషయాలు వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మంత్రులు వెళ్లి వాస్తవాలు ఏమిటో చూసి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎండిన పొలాలు ఎక్కడున్నాయో ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి టోల్ ఫ్రీ నంబర్ పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రశ్నించడమే పాపమన్నట్టు వ్యవహరించడం తగదని హితవు పలికారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని విమర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో చెప్పాలని సవాల్ విసిరారు. వంద సీట్లు కూడా రావని చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో లేదు కాబట్టి, ఇక ఎప్పటికీ రాదు అంటామా? అని ప్రశ్నించారు. రెండు సీట్లు మాత్రమే ఉన్న బీజేపీ ఇప్పుడు అధికారంలో లేదా? అని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంత కాలం బీఆర్ఎస్ కూడా ఉంటుందని స్పష్టం చేశారు.

### ప్రభుత్వ వైఫల్యం వల్లే నీళ్లు రావడం లేదు

నీళ్ల పరిస్థితిపై రాష్ట్రవ్యాప్తంగా, ప్రాజెక్టుల వారీగా ప్రభుత్వం కనీసం సమీక్ష నిర్వహించలేదని శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కరివెన, వట్టెం, ఏదుల రిజర్వాయర్లు ఏమేరకు పూర్తయ్యాయో సమీక్షించాలని కోరారు. కేసీఆర్ సీఎం అయ్యాక రాష్ట్రంలో కరువు జాడేలేకుండా పోయిందని పేర్కొన్నారు. తెలంగాణ కొట్లాడిన, తెలంగాణ తెచ్చిన వ్యక్తి, మాజీ సీఎం కేసీఆర్‌ను ఇష్టారీతిన మాట్లాడటం సరికాదని హితవు పలికారు. గత అసెంబ్లీ చేసిన తీర్మానాల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో పోరాడాలని సూచించారు. నిందలు వేయడంమాని రైతుల కష్టాలపై దృష్టిసారించాలని కోరారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి హామీలు అమలయ్యాయో, లేదో తెలుసుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా ప్రభుత్వం వైఫల్యం కారణంగానే నీళ్లు రావడం లేదని ఆరోపించారు. తెలంగాణను ఆగం చేయవద్దని, ఏపీలో కలిసిన ఏడు మండలాలను వెనక్కి తీసుకురావడానికి ప్రయత్నించాలని ప్రభుత్వానికి సూచించారు. కేఆర్ఎంబీపై ఉమ్మడిగా కొట్లాడేందుకు కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చరిత్ర తెలుసుకొని, చూసుకొని మాట్లాడాలని హితవు పలికారు. నాయకులు పోయినంత మాత్రాన పార్టీ పోతుందా? అని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు.

## కాంగ్రెస్ మాదిగ ద్రోహుల పార్టీ

- ఒక్కసీటైనా మాదిగలకు ఇచ్చారా?
- కడియం శ్రీహరిని రాజకీయంగా బొందపెడతాం
- మతిభ్రమించి మాట్లాడుతున్న కేకే
- కళాకారులకు క్షమాపణ చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రసమయి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా మాదిగలకు ఇవ్వని కాంగ్రెస్ మాదిగ ద్రోహుల పార్టీగా మిగిలిపోయిందని, ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 80 లక్షల మంది మాదిగలకు కాంగ్రెస్ ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాకారులను అవమానించిన కేశవరావు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో రసమయి మాట్లాడుతూ మాదిగలు ఎవరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. తెలంగాణలో అత్యధికంగా ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని మండిపడ్డారు. మాదిగలకు సీటు ఇవ్వకుంటే చావు డప్పు కొడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి మాదిగ ద్రోహి అని, వరంగల్‌లో ఆయనపై చావుడప్పు కొడతామని తెలిపారు. మతిభ్రమించి మాట్లాడుతున్న ఎంపీ కేశవరావు వెంటనే కళాకారులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆయన ఇంటిముందు ధూంధాం నిర్వహిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ తెలంగాణపై విషం చిమ్ముతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాటకు చరిత్ర లేకపోతే 'జయజయహే తెలంగాణ' పాటను రాష్ట్రగీతంగా ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. మిలియన్ మార్చ్‌లో కేశవరావును కోడిగుడ్లతో కొట్టారని గుర్తుచేశారు. కేశవరావు బిడ్డ అంటే ఎవరికీ తెలియని విజయలక్ష్మికి కేసీఆర్ మేయర్ పదవి ఇచ్చారని పేర్కొన్నారు. ఓట్ల కోసం గద్దర్‌ను వాడుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదని దుమ్మెత్తిపోశారు.

### మాదిగజాతి అంటే కండ్లమంట

కడియం కావ్య కూడా కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని రసమయి ఎద్దేవా చేశారు. శ్రీహరి ఏ బడిలో చదువుకున్నారో, ఎక్కడ బడి చెప్పారో ఎవరికీ తెలియదని పేర్కొన్నారు. ఆయన ఏనాడైనా 'జై తెలంగాణ' అన్నాడా అని ప్రశ్నించారు. ఆయన మాదిగ ద్రోహి అని, మాదిగ జాతి అంటే ఆయనకు కండ్లమంట అని విమర్శించారు. కడియం వైఖరి వల్లే తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్‌లాంటి వారు బీఆర్ఎస్‌ను వీడారని చెప్పారు. కడియంను ఓడించి పాతిపెట్టే వరకు రసమయి బాలకిషన్ కాలుకి గజ్జెకట్టి ఆడిపాడతాడని తెలిపారు. శ్రీహరికి ఏమాత్రం దమ్మూధైర్యం ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ ఓట్ల కోసం బీజేపీ తాపత్రయపడుతున్నదని, పదేండ్లుగా అధికారంలో ఉండి వర్గీకరణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మాదిగలకు కాంగ్రెస్ ఎన్ని సీట్లు ఇచ్చిందో మందకృష్ణ మాదిగ ఎందుకు అడగడం లేదని రసమయి బాలకిషన్ ప్రశ్నించారు.

## రైతులకు ధైర్యం చెప్పలేని పిరికివాళ్లు

- హోల్‌సేల్‌గా మోసం చేసిన కాంగ్రెస్
- హామీలన్నీ సర్కారు అమలు చేయాలి
- ప్రాజెక్టులపై అవగాహన లేని ప్రభుత్వం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా ఒక్క రైతునైనా ప్రభుత్వం పరామర్శించలేదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతాంగాన్ని పరామర్శించి ధైర్యం ఇచ్చే సత్తాలేని పిరికివాళ్లు కాంగ్రెస్ మంత్రులని ఎద్దేవా చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సేద్యానికి ఊపిరి పోసింది ఎవరో? ఉసురు పోసుకుంటున్నది ఎవరో రైతులందరికీ తెలుసని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో రైతులకు ప్రకటించిన పథకాలన్నింటినీ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు నిలదీస్తారన్న భయంతోనే ముఖ్యమంత్రి, మంత్రులు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతులను, ప్రజలను హోల్‌సేల్‌గా మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేసినందుకు రైతులు వారి చెప్పులతో వారే కొట్టుకుంటున్నారని అన్నారు. రైతుబంధు, రైతుబీమా స్కీమ్స్ తీసుకొచ్చిన కేసీఆర్ నిబద్ధతను కాంగ్రెస్ నేతలు ప్రశ్నించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను పట్టించుకోని కాంగ్రెస్ నేతలు ఇతర పార్టీల వారికి కండువాలు కప్పే పనిలో బిజీగా ఉన్నారని విమర్శించారు. మంత్రి తుమ్మ ల పరిస్థితి చూస్తే జాలేస్తున్నదన్నారు. గతానికి, ఇప్పటికీ ఉన్న తేడా కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. యాసంగి పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులపై ప్రభుత్వానికి అవగాహన లేదని, నీటిని మళ్లించుకునే ఆలోచన లేదని ధ్వజమెత్తారు. ప్రకృతి విపత్తును రాజకీయం చేస్తున్నారన్న మంత్రి తుమ్మల, అదే కారణంతో మేడిగడ్డ బరాజ్‌లోని మూడు పిల్లర్లు కుంగాయన్న సంగతి తెలియదా? అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు.

## రేవంత్.. రాళ్ల దెబ్బలకు సిద్ధమా?

- ఫిరాయింపులపై నాడు చెప్పిందేమిటి?
- సీఎంగా ఇప్పుడు చేస్తున్నదేమిటి?
- రేవంత్‌రెడ్డి, మోదీ ఒక్కటే
- రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం
- అర్వింద్‌తో సుదర్శన్‌రెడ్డి కుమ్మక్కు
- నిజామాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో వేముల

నిజామాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఒక పార్టీలో గెలిచినవారు ఎవరైనా మరో పార్టీలోకి వెళ్తే, వారిని రాళ్లతో కొట్టి చంపాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారని, ఇప్పుడు ఆయనే ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు కండువాలు కప్పుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు ఎవరిని రాళ్లతో కొట్టాలో చెప్పాలని ప్రశ్నించారు. కడియం శ్రీహరి, కేశవరావు, రంజిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, దానం నాగేందర్‌కు కండువా కప్పినందుకు రేవంత్ రాళ్ల దెబ్బలకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అర్బన్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో వేముల మాట్లాడుతూ.. పార్టీ మారేవాళ్లను పిచ్చికుక్కను కొట్టినట్టు కొట్టాలన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు పిచ్చికుక్క ఎవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఎంపీ అభ్యర్థులు లేకనే బీఆర్ఎస్ నేతలను తీసుకెళ్తున్నారని ఎద్దేవా చేశారు.

### అర్వింద్‌కు సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి సహకారం

గత లోక్‌సభ ఎన్నికల్లో కల్వకుంట్ల కవితను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని, ఇప్పుడు కూడా అర్వింద్‌ను గెలిపించేందుకు మరో కుట్రకు తెరలేపారని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని, అందుకే కాంగ్రెస్ అభ్యర్థిగా జగిత్యాలకు చెందిన జీవన్‌రెడ్డిని నిలబెడుతున్నారని చెప్పారు. మైనార్టీ ఓటర్లు ఈ అక్రమ సంబంధాన్ని గుర్తించాలని విజ్ఞప్తిచేశారు. గత ఐదేండ్లలో ఈ ప్రాంతం ముఖమే చూడని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఓటు వేయడం వృథా అని చెప్పారు. ఎవరు ఎన్ని చేసినా బీఆర్ఎస్ గెలుపు తథ్యమన్నారు. కాలు మంచిగా లేకున్నా, బిడ్డ జైలులో ఉన్నా కేసీఆర్ రైతుల కోసం బయటకు వచ్చి ప్రభుత్వ కుట్రలను బట్టబయలు చేస్తున్నారని వివరించారు.

### త్వరలోనే బీజేపీలోకి రేవంత్‌రెడ్డి

మొన్న మోదీ ఎదుట గుజరాత్ అభివృద్ధి బాగున్నదని, తెలంగాణలో గుజరాత్ మాడల్ తెస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి మాటను ప్రజలు గమనించాలని వేముల విజ్ఞప్తి చేశారు. బడే భాయ్, చోటే భాయ్ ఏకీ హై.. త్వరలోనే రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను బొందపెట్టి బీజేపీలోకి వెళ్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ఉన్నదని తెలిపారు.

## నిరుద్యోగులను ఏప్రిల్ ఫూల్స్ చేయొద్దు

### ప్రభుత్వానికి బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ) : ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులను ఏప్రిల్ ఫూల్స్ చేయొద్దని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కాంగ్రెస్ గ్యారంటీల్లో భాగంగా రాష్ట్రంలో నేడు లక్షలాదిమంది నిరుద్యోగులు గ్రూప్-2 నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. వారి ఆశలు అడియాసలు కాకుండా కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను ప్రవీణ్ కుమార్ ఈ సందర్భంగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామని కాంగ్రెస్ పార్టీ తమ జాబ్ క్యాలెండర్‌లో తేదీలతో సహా ప్రకటించిన విషయం విదితమే.

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువే

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే పంటలు ఎండిపోతున్నాయని, ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తీగలబంజర గ్రామంలో రైతు భుక్యా శ్రీనుకు చెందిన మూడెకరాల్లో ఎండిపోయిన మక్కజొన్న పంటను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ నామా మాట్లాడుతూ.. సాగునీరు అందక చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే సర్కారు చోద్యం చూస్తున్నదని మండిపడ్డారు.

- కొణిజర్ల

## రైతుపై కనికరం చూపని కాంగ్రెస్ సర్కారు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కనికరం లేకుండా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయంలో నీళ్లు లేక తేలిన శాభాష్‌పల్లి రోడ్డు, బీటలు వారిన భూమిని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సాగునీరు లేక రైతులు తల్లడిల్లుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని మండిపడ్డారు.

- రాజన్న సిరిసిల్ల, నమస్తే తెలంగాణ/బోయినపల్లి

## ఇది అసమర్థ ప్రభుత్వం తెచ్చిన కరువు

వందరోజుల కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రంలో కరువు తాండవం చేస్తున్నదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఇది సహజంగా వచ్చిన కరువు కాదని, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని ఆయన విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే బండ్ల ఎండిన పంటలను పరిశీలించారు. రైతులు ఎమ్మెల్యేకు తమ గోడును వినిపించి ఆదుకోవాలని వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని, కనీసం సమీక్ష కూడా చేయడం లేదని మండిపడ్డారు.

- కేటీదొడ్డి